# పాలెగాడు

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట గాథ

(1805-1847)



యస్.డి.వి. అజీజ్

# పాలెగాడు

## 1

"కొక్కరకో..."

మలిఝామున కూసిన కోడికూత అది!

ఆ సమయంలో అతను ఒక్కమారుగా ఉలిక్కిపడి లేచాడు. ఆ కోడి కూత అతనిలోని నిద్రాదేవిని పారద్రోలి జాగృతపరిచింది. జాగృతపడ్డ అతను తన వృత్తి, ప్రవృత్తిమేర చివరిసారిగా "పారా హుషార్" అని అరుస్తూ తానంతవరకు పడుకొన్న మర్రిచెట్టు మొదలు వీడి హుషారుగా వడివడిగా అడుగులు వేస్తూ కొంతదూరం సాగిపోయి హఠాత్తుగా ఆగి పోయాడు.

కారణం?

అతనికి కొద్ది దూరంలో కొంతమంది వ్యక్తులు గుంపుగా కలిసి భూమ్యాకాశాలు దద్దరిల్లిపోయేలా అరుచుకొంటూ రావడమే! వారిలో ... కొంతమంది చేతుల్లో దివిటీలు... ఇంకొంత మంది చేతుల్లో పొడుగాటి కత్తులు అవి బాగా పదునుపెట్టబడి నునుపు దేరి వున్నాయి. వారు వాటిని ఝళిపిస్తున్నప్పుడు తళుక్కుమని మెరిసేకాంతి అతనిలో అదోరకమైన విభ్రాంతిని రేకెత్తిస్తూ వుంది. వారి పోలికేకలు దిక్కులన్నింటా మారుమ్రోగి ప్రకృతిని ప్రతిధ్వనింపజేశాయి. జేస్తున్నాయి.

అతను పూనకం వచ్చినవాడిలా వూగిపోతూ తన భృకుటి ముడివేసి 'వాడి' వంక సూటిగా చూశాడు.

నల్లటి ఆకారం వాడిది.

ఎత్తు అయిదడుగులకు మించి వుండదు.

శరీరంపై ఎలాంటి అచ్ఛాదనలేక నగ్నంగా వున్నాడు. వాడి ఆపాదమస్తకం ఒక్క వెంట్రుకలేదు. మునిమాపువేళే అన్నీ కత్తిరించబడ్డాయి. కనుబొమలు సైతం కత్తిరించబడి వున్నాయి. వాడి కటి ప్రదేశాన కూడా ఒక్క వెంట్రుకలేదు. అంతా శుభ్రపరచబడి ఉంది.

వాటి నుదుట ఎర్రని కుంకుమబొట్టు.

వాడి కళ్ళు నిప్పుకణికల్లా మారి విచిత్రంగా మెరుస్తున్నాయి.

వాడి తలపై ఓ వెడల్పాటి తట్ట! వెదురుబొంగుతో తయారు చేసిన తట్ట!

పొలితట్ట!

ఆ తట్టలో... బండారు – (జొన్నన్నం + కుంకుమ + పసుపు కలిసిన పదార్థం) వాడుకూడా అతని వంక సూటిగా చూశాడు. ఆ చూపులో ఏదో తెలియని గొప్ప ఆకర్షణ! ఆ ఆకర్షణకు లోనయిన అతని తనువులో మున్నెన్నడూ కలుగని ఉద్వేగం! అవ్యక్తావేశం!

ఫలితం?

అతని శారీరక చర్యల్లో అనుకోని మార్పులు! అతని అణువణువులో ఉద్రిక్తత! నరాలు బిగుతెక్కాయి. ఇంకొక్క క్షణం కూడ ఆగలేకపోయాడు. తన వృత్తి, ప్రవృత్తి పదమైన "పారాహుషార్" పదాన్ని మరచి "పోలోపొలి" అంటూ గుంపులో కలుస్తుండగా వాడొక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు.

"పోలోపొలి" అంటూ!

తల తెగింది.

ఎర్రటి నెత్తురు చివ్వున అతని ముఖంపై కెగిసింది.

ఇంకతను ఏమాత్రం ఆగలేకపోయాడు. తానూ "పొలోపొలి" అంటూ గట్టిగా అరుస్తూ గుంపులో కలిసిపోయాడు.

నేలకొరిగింది ఓ మూగజీవి గిలగిలా తన్నుకొంటూ! విగతజీవి అయిన ఆ మూగ జీవిపై వాడు తన తలపైన తట్టలోని బండారు కొద్దిగా చల్లాడు.

అంతే!

మరుక్షణంలోనే ఆ మూగప్రాణి అక్కడ్నుంచి అదృశ్యమయ్యింది ఆ ప్రాణి ఓ గొర్రెపిల్ల.

వాడు "పొలోపొలి" అని అరిచినప్పుడల్లా ఒక్కోమూగజీవి బలి అవుతూవుంది. మరునిముషంలోనే అదృశ్యమౌతూ వుంది. ఆ ప్రాణి కత్తికి బలవుతూ "మ్యా – హా – హా"" అని అరచిన అరుపులు వారికి ఆర్తనాదాల్లా కాక ఆనంద రాగాల్లా వినిపిస్తున్నాయి. ఆ అరుపులు ఆ గుంపుకు మరింత ఉత్తేజాన్ని, హుషారును చేకూరుస్తున్నాయి. అంతటితో వారి హుషారు ఆగలేదు. దాని నెత్తురును తమవొంటికి పూసుకుని పిచ్చిగెంతులు వేసే పైశాచిక స్థాయికి చేరుకుంది.

అప్పటిదాకా వాడి పైశాచిక పొలికేకకు బలైన మూగజీవుల సంఖ్య నూటిలో ముప్పాతిక వంతు! ఇక ఒక వంతుమాత్రమే మిగిలివుంది. తెల్లారే లోపు ఆ ఒక్కవంతు పూర్తయిపోవాలి! తెల్లారడానికింక రెండు గడియలు మాత్రమే వ్యవధుంది. ఆ వ్యవధిలో వాడు ఊరంతా తిరగాలి! వాడలా తిరుగుతున్నప్పుడు ఆ వూరి వారు వూరి బయటికి వెళ్ళడంగాని, బయటి వూరి వారు వూళ్ళోకి రావడం కాని ఏ మాత్రం జరగదు. జరగకూడదు. ఆ వేళప్పుడు వూరి వారు కూడా ఇల్లు ఒదిలి బయటకు వెళ్ళడానికి జంకుతారు.

ఎవరూ బయటి వూళ్ళనుంచి రాకుండా వుండేందుకు చాలామంది వూరి చుట్టూ కాగడాలతో కాపలా కాస్తున్నారు. ఎవరైనా వస్తే వారి ప్రాణాలు పోవడం ఖాయం. అలా వూరంతా తిరుగుతూ కాపలా కాయడానికి, పైశాచిక మారణహోమం సల్పడానికి కారణం?

దేవర!

తెల్లారితే దేవర !!

పెద్దమ్మ దేవర !!!

పదేండ్ల కొకమారు వచ్చే దేవర!

ప్రకృతి భీష్మించుకు కూర్చొని పుడమితల్లిని అనావృష్టి పేరుతో క్షోభింప జేస్తున్నప్పుడు, పుడమితల్లి "పెద్దమ్మ" రూపంలో జ్వలించి జనాన్ని భయభ్రాంతుల్ని చేసి ఏర్పాటు చేయించుకొన్న దేవర.

పండుగలకే పండుగ ఈ దేవర !

అనార్యుల సంస్కృతికి అనవాలమైన పండుగ !

తెల్లారితే మరింత పైశాచకత్వాన్ని ప్రభవింప జేసే పండుగ. ఈ అమ్మవారి దేవర !

❄ ❄ ❄ ❄

తెల్లారింది!

'బూతపిల్లి' కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగింది (దేవర రోజు ముందురాత్రి "పోలోపొలి" అంటూ నగ్నంగా ఊరంతా తిరిగేవాడ్ని 'బూతపిల్లి' అంటారు.)

నూటొక్క గొర్రెపిల్లల తలలెగిరిపోయాయి.

మునిమాపు వేళ జరిగే దేవర తాలుకు పైశాచిక సన్నాహాలు మొదలయ్యాయి. ఆ సన్నాహాల్లో మొదటి భాగంగా అమ్మవారికి బలి పశువుగా నిర్ణయించిన ఎనుబోతును, గత అయిదేళ్ళుగా ఇష్టం వచ్చినట్టుగా తిని పెరిగి బలిష్టంగా తయారైన ఎనుబోతును కొంతమంది కండలు తిరిగిన యువకులు పొడుగాటి మోకులతో అతికష్టంతో దాన్ని

బంధించి అదుపులోకి తెచ్చుకొని గాఢమైన సున్నపు నీటిని తాగించారు. అలా తాగించడం అది మూడవసారి. గత మూడ్రోజులుగా దాన్ని శారీరకంగా హింసించి సున్నపు నీటిని తాగిస్తూనే వున్నారు. శక్తి ఉడిగి పూర్తిగా తమ ఆధీనంలోకి రావడానికి.

సున్నం నీళ్ళు తాగించేప్పుడు అది అరచిన అరుపులు, చేసిన హుంకారాలు అదొక వినోదంగా తిలకిస్తున్న పసిహృదయాల్లో గుబులు పుట్టించి, గుండెదడ ఎత్తించి భయభ్రాంతుల్ని చేశాయి!

పని పొద్దయ్యింది –

రెండవ సన్నాహం మొదలైంది.

మరికొంత మంది వ్యక్తులు జొన్నదంట్లతో వూరి మధ్యలో ఓ పూరి గుడిసెను తయారు చేసి, అందులో మట్టితో చేసిన పెద్దమ్మ బొమ్మను వుంచారు. అది అస్పష్ట రూపంలో వుంది. చూపరులకు భీతిని పుట్టిస్తూ వుంది. గుడిసెను ఆ బొమ్మను మునిమాపు వేళ, పెద్దమ్మకు ఎనుబోతును బలి ఇచ్చిన వెంటనే తగుల బెట్టాలి. "పొలి పోతుందహో!" అంటూ, అమ్మవారికి దిష్టి తగలకుండా వుండేందుకు.

దేవర సందర్భాన్ని పురస్కరించుకొని ఆ వూర్లోని ప్రతి ఇంట్లో ఉద్రిక్త వాతావరణం. ఎవరిని పలుకరించి చూసిన వారి కళ్ళల్లో అవ్యక్తాందోళన! దానికి కారణం దేవరే! అయితే ఆ అవ్యక్తాందోళనలో కూడ భాష్యం ఎఱుగని ఆనందం! సంతోషం!!

మిట్ట మధ్యాహ్నమైంది –

ముఖ్యమైన మూడో సన్నాహం మొదలైంది.

బలిపశువుగా నిర్ణయించబడిన ఎనుబోతుకు అలంకరణ పూర్తయ్యింది. దాని ఒళ్ళంతా పసుపు కుంకుమతో నిండి వుంది.

అది పారిపోకుండా వుండేందుకు దాని అంగంగానికి బలమైన పలుగుతాడు కట్టి, కొండల్ని సైతం పిండి చెయ్యగల బలం వున్న యువకులు దానికి కట్టిన పలుగు తాడును తమ నడుములకు చేతులకు చుట్టేసుకుని దాని చుట్టూ వలయంగా నిలబడి వున్నారు. అయినా అది ఏ మాత్రం బెదరక హుంకరిస్తూనే వుంది.

తప్పెట్ల మోతలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఎర్రటి ధూళి ఆకాశానికి ఎగిసింది. జనంలో సందడి మొదలైంది. మిన్నంటిన ఆ మోతల్తో ఎనుబోతును బలవంతంగా నడిపించుకొంటూ ఆ వూరిబయటి పెద్దమ్మ గుడి దగ్గరికి తీసుకెళ్ళారు. అప్పటికే అక్కడ ఇసుక వేస్తే రాలనంత జన సందోహం!

అనాకారంగా వుంది అమ్మవారి విగ్రహం.

ఆ విగ్రహం ఆపాదమస్తకం అజ్యాభిషేకం!

ఆ అజ్యాభిషేకంపై పసుపు.... కుంకుమ... విగ్రహానికి కుడివైపున వరుసగా పోలికుండలు పేర్చబడి వున్నాయి. (జొన్నన్నంతో నిండివున్న కుండల్ని 'పోలికుండలు' అంటారు.)

విగ్రహం ఎదురుగా మాత్రం నల్లటి కంబళి. ఆ కంబళిపై మనిషి నిలువెత్తున అన్నపురాశి! ఎనుబోతు తలను నరికి దాని రక్తాన్ని ఆ రాశిలో కలుపుతారు. అప్పుడది 'పొలిముద్ద' అవుతుంది. ఆ పొలిముద్దను తీసుకెళ్ళి తమ తమ ఇళ్ళల్లో, పొలాల్లో చల్లుకుంటారు. అలా చల్లుకొంటే ఎలాంటి అరిష్టాలు రాక పిల్లా పెద్దా హాయిగా వుంటారని, పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం!

ఎనుబోతు బలికి సిద్ధమయ్యింది.

జనంలో అరుపులు తగ్గుముఖం పట్టాయి.

ఉత్కంఠత పెరిగింది.... ! రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఎనుబోతును అమ్మవారి విగ్రహం చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ చేయించారు. జన సందోహాన్ని చీల్చుకొని ఓ వ్యక్తి ఎనుబోతు దగ్గరికి వచ్చాడు. అతని చేతిలో పొడుగాటి కత్తి! తాకితే చాలు తెగే ప్రమాదం గల కొన పదును దేరి వున్న కత్తి అది! అతను జనం వంక ఓ మారు తేరిపార జూస్తూ అమ్మవారికి భక్తి పూర్వకంగా ప్రణమిల్లి తన దృష్టిని విగ్రహం పక్కనే కొమ్మకు వేలాడబడివున్న మొండెం లేని మానవ కపాలం వంక చూశాడు.

అంతే!

ఒక్కసారిగా అతని వెన్నులో జలదరింపు!

ఆ జలదరింపు కలగకూడదని అతను తీసుకొన్న తాటికల్లు వల్ల కలిగిన మైకం చప్పున దిగిపోయింది. కొన్ని నిముషాలపాటు అతని గుండెల్లో దడ !... అలజడి! అతడిలోని అలజడిని జనం గ్రహిస్తే అది అతని ప్రాణాలకే ప్రమాదం! అందుకే అతడు తనలోని అలజడిని పారద్రోలి కృత్రిమ గాంభీర్యాన్ని తెచ్చి పెట్టుకొన్నాడు.

మొండెం లేని ఆ కపాలం అతని తాలూకుదే! అది స్వయాన అతడి తండ్రి చాకలి తిప్పడిది!

ఎనుబోతును నరికే బాధ్యత... ఏ వూర్లో అయితే దేవర చేస్తారో ఆ వూరి రజకులపై వుంటుంది. అది వారి వంశపారంపర్యపు బాధ్యతాయుతపు హక్కు! చాకలి తిప్పడికి ఆ హక్కు అలా సంక్రమించిందే! అయితే ఆ హక్కును అతను తాగుడు వ్యసనంలో పడి బాధ్యతను సరిగా నిర్వర్తించలేక పోవడం వల్ల ఎనుబోతు తలకు బదులుగా తన తలను నరికించుకొన్నాడు.

ఎనుబోతును ఒక్క వేటున ఖండించాలి. అలా ఖండించకపోతే, నరికేవాడి తల ఖండింపబడుతుంది. అలా ఖండింపబడిందే చాకలి తిప్పడి శిరస్సు! మొండెంలేని ఆ కపాలాన్ని చూడగానే అతడికి తన కళ్ళముందే తన తండ్రిని అతి నిర్దాక్షిణ్యంగా నరికిన విధానం గుర్తొచ్చింది.

రక్తం సలసల కాగింది!

కళ్ళు చింతనిప్పులయ్యాయి.

అరచేతి నరాల్లో పటుత్వం పెరిగింది.

అంతవరకు ఒంటి చేత పట్టుకొన్న కత్తిని తన రెండు అరచేతుల మధ్య బిగదీసి తిరిగి అమ్మవారి చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ సల్పి బలికి సిద్ధమయ్యాడు. ఆ సమయంలో అతని భీకర రౌద్రరూపాన్ని చూసి జనం భయవిహ్వాలులయ్యారు. వారి ఎద సవ్వడి పెరిగింది. అతను తూచి తూచి ఒక్కో అడుగు వేస్తూ ఎనుబోతును సమీపిస్తున్నప్పుడు, బూకా నాదాలు నింగినంటాయి.

జనంలో మళ్ళీ అరుపుల హోరు!

ఎనుబోతుకు కట్టిన పలుగుతాళ్ళు మరింత బలంగా బిగుసుకున్నాయి. జనం హోరును, తన పాలిటి కాలయముడిలా ఒక్కో అడుగు వేస్తూ, తన దరికొస్తున్న అతన్ని క్రీగంట గమనించింది ఎనుబోతు. జరగబోయే పరిణామం ఏమిటో దానికి పూర్తిగా అవగతమైపోయింది. ఒక్క మారుగా, నేలమీది ధూళి సైతం తన నాసిక రంధ్రాల్లోకి చొచ్చుకొచ్చేలా గట్టిగా గాలి పీల్చి వొదిలి రొప్పుతూ అటు ఇటు కదిలింది. ఫలితంగా పలుగు తాళ్ళల్లో పటుత్వం తగ్గింది. అతను పూర్తిగా దాని దగ్గరికి వచ్చేశాడు. ఎనుబోతుకు అతడికి మధ్య దూరం కేవలం ఒక అడుగు మాత్రమే! అతను కూడా ఓ మారు గుండెల నిండుగా గాలి పీల్చుకొని తన రెండు చేతులతో బలంగా పట్టుకొన్న కత్తిని నిటారుగా పైకి లేపి ఓ క్షణం పాటు కళ్ళు మూసి పిదప తన కంఠనాళాలు చిట్లిపోయేలా "కోబలి" అని అరుస్తూ మదించిన దాని మస్తకంపై కత్తి దించబోయాడు.

అంతే !!

ఎవరు కూడా కల్లో సైతం ఊహించని హఠాత్పరిణామం జరిగిపోయింది. ఎనుబోతు పలుగు బంధనాలు తెగిపోయాయి. జనాల్లో పైశాచిక పోలి అరుపులకు బదులుగా హాహాకారాలు మిన్నంటాయి. ఆర్తనాదాలు చెలరేగాయి.

❄ ❄ ❄ ❄

## 2

"దొరా!"

అతని హృదయాంతరాల్లో నుంచి ఒక్క మారుగా వెలికివచ్చిన పొలికేక లాంటి కేక అది!

ఆ కేక విన్న నరసింహారెడ్డి ఉలికిపాటుగా చూశాడు. ఎదురుగా రక్తసిక్తమైన దేహంతో తన నమ్మినబంటు ఓబయ్య ఎగరొప్పుతూ అతి కష్టంగా శ్వాస పీలుస్తున్నాడు. అతడి పరిస్థితి గమనించిన నరసింహారెడ్డి కంగారుతో ఆదుర్ధాగా అడిగాడు.

"ఏమైంది ఓబయ్యా?"

"ఘోరం జరిగిపోయింది దొరా!" భోరున విలపిస్తూ చెప్పాడు ఓబయ్య.

"ఘోరం జరిగిందా?" నరసింహారెడ్డి కంఠం వొణికింది.

"అవును దొరా! ఏం జరిగిందో ఏమో? అమ్మవారికి కోపం వచ్చింది. దేవరదున్న తప్పించుకుంది."

"దేవరదున్న తప్పించుకుందా?" నొసలు చిట్లించి బాధగా అడిగాడు నరసింహారెడ్డి.

"ఏమొచ్చిందో ఏమో దొరా? మన చాకలి తిప్పడి కొడుకు ఈరిగాడు దేవరదున్నను నరకబోతుండగా, పలుగుతాళ్ళు తెంచుకొని, తప్పించుకుంది. దాన్ని పట్టుకోవాలని నా శక్తికొలదీ ప్రయత్నం చేశాను దొరా. కాని అది దొరకలేదు దొరా?" వొగరుస్తూ చెప్పాడు ఓబయ్య.

"దున్న చేసిన గాయాలేనా ఇవి?" నరసింహారెడ్డి కంఠం గంభీరంగా పలికింది.

"అవును దొరా!" నెత్తురోడుతున్న గాయాలవంక చూసుకుంటూ చెప్పాడు ఓబయ్య.

ఎనుబోతు తప్పించుకొందంటే జరిగే పర్యవసానమేమిటో నరసింహారెడ్డికి సులభంగానే గ్రాహ్యమైంది.

"పద వెళ్దాం!" అంటూ తన పొడుగాటి బాహువుల్ని అతని భుజంపై చేర్చి ముందుకు కదిలాడు.

ఇద్దరూ కొంతమంది పరివారంతో దేవర జరిగే ప్రాంతం చేరుకొనే సరికి మునిమాపు వేళ దాటిపోయింది. మసకచీకట్లు కమ్ముకున్నాయి. దివిటీల వెలుగులో ఆ ప్రాంతాన్నంతా నిశితంగా గమనించారు.

రణం ముగిసిన యుద్ధభూమిలా తయారై వుంది అక్కడి ప్రాంతం. చెల్లాచెదురై ముద్దలుగా పడివున్న పోలి అన్నం, పగిలి ముక్కలైన పొలికుండలు... కట్లు తెంచుకుని ఎనుబోతు స్వైరవిహారం చేస్తున్నప్పుడు ప్రాణభీతితో జనం మధ్య రేగిన తొక్కిసలాటలో

ప్రాణాలు కోల్పోయిన పసికందులు... తన బారినుండి తప్పించుకున్న ఎనుబోతును ప్రతిఘటించబోయి దాని వాడికొమ్ముల కుమ్ములకు ప్రాణాలు కోల్పోయి విగతజీవుడై పడివున్న చాకలి తిప్పడి కొడుకు ఈరిగాడి శవం! గాయాలపాలైన ప్రజానీకం ఆక్రందనలు.

బీభత్సంగా తయారైన అక్కడి పరిస్థితిని చూసి నరసింహారెడ్డి చలించిపోయాడు. అతని గంభీరవదనంలో విషాదం అలుముకొంది. ఓబయ్య నరసింహారెడ్డితో ఏదో అనబోతుండగా సన్నటి మూల్గు వినిపించింది. అందరూ మూల్గు వచ్చిన వంక తమ దృష్టి సారించి దిగ్భ్రాంతులయ్యారు! వారికి కొద్ది దూరంలో అమ్మవారి విగ్రహం ప్రక్కనవున్న మొదల్ను ఆనుకొని బాధతో విలవిలలాడుతూ మెలికలు తిరిగిపోతున్న ఓ నిండు చూలాలు! ఆమె కూడా ఎనుబోతు దాడికి గురి అయ్యిందే!

అందరూ ఒక్క అంగలో ఆమెను సమీపించి, ఆమె వంక ఎగా దిగా చూస్తూ ఒక్కమారుగా అదిరిపడ్డారు! వారి అదురుపాటుకు కారణం? ఆమె గర్భానికి కుడివైపున అయిన వెడల్పాటి గాయం! ఆ గాయం నుండి రక్తం విపరీతంగా స్రవిస్తూ వుంది... ఆమె ధరించిన శ్వేతవస్త్రాల్ని రుధిరవర్ణంలోకి మారుస్తూ... ఎనబోతు కొమ్ము కుమ్మువల్ల ఏర్పడిన గాయం అది!

కొద్ది సేపటికి అందరి మస్తిష్కాల్లో నిస్తబ్ధత!

కొద్దికాలం గడిపింది.

గాయమైన ఆ ప్రదేశం నుంచి ఈసారి వెలికివచ్చింది ఎర్రని చిక్కని రక్తం కాదు. ఆమె గర్భం నుండి త్వరలో జననం తీసుకోబోతున్న తొమ్మిది మాసాల శిశువు హస్తం! పిడికిలి బిగించి వుందా హస్తం!

మరోమారు అక్కడి వారందరూ స్థాణువులయ్యారు. హృదయవిదారకమైన ఆ దృశ్యం అందరి హృదయాల్ని కలచివేసింది. మరో గడియకాలంలోనే ఈ వార్త ఆ వూరంతా దావానలంలా వ్యాపించింది. ఈ వార్త విన్న జనం గుండెలవిసేలా పరుగెత్తు కుంటూ వచ్చారు. ఆ దృశ్యాన్ని చూడ్డం వల్ల వారి గుండెలు భీతిల్లాయి, కళ్ళు చెమర్చాయి.

ఆమె సంబంధీకులు గుండెలు బాదుకొంటూ కంఠశోష వచ్చేంత వరకూ ఏడ్పు సాగిస్తున్నారు. అక్కడి వారందరికి పూర్తిగా అవగతమై పోయింది.... ఆ పరిస్థితి ఇంకా కాసేపు అలాగే కొనసాగితే ఆమెకు, ఆమె గర్భంలోని శిశువుకు ప్రమాదం తప్పదని తెలుసు. ఎవరికి ఏమీ పాలుపోవడం లేదు.

నరసింహారెడ్డి ఆజ్ఞతో ఓబయ్య వూర్లోని వైద్యులను తోడ్కొని వచ్చాడు. చుట్టు ప్రక్కల గ్రామాలన్నింటిలోనూ సాటిలేని మేటి వైద్యులుగా పేరుగాంచిన ఆ వైద్య శిఖామణులకు కూడా ఏం చెయ్యాలో దిక్కు తోచలేదు.

శిశువు హస్తాన్ని బలవంతంగా లోపలికి నెడితే అటు తల్లికి ఇటు బిడ్డకు ప్రమాదం! ప్రాణాపాయం కూడా వాటిల్లవచ్చు! ఎటూ పాలుపోక వారు కూడా తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తూ నరసింహారెడ్డిని ఉద్దేశించి పలికారు.

"దొరా! ఏం చెయ్యాలో మాకు కూడా పాలుపోవడం లేదు. ఇలాంటి వైపరీత్యము మేము మున్నెన్నడూ కనీ వినీ ఎరుగము. శిశువు చేతిని బలవంతంగా లోపలికి నెడితే తల్లికీ బిడ్డకూ ప్రాణహాని జరగవచ్చు!".

"మీరే అలా అంటే ఎలా?" తీవ్ర మనస్థాపానికి గురి అవుతూ అడిగాడు నరసింహారెడ్డి.

"దొరా! శిశువు తన చేతిని తనంతట తానే లోపలికి తీసుకునేలా ఎవరైనా చెయ్యగలిగితే ఆమె గర్భానికి ఏర్పడిన గాయాన్ని సులువుగా పూడ్చడానికి వీలుంటుంది. ఎవరైనా ఈ పని చెయ్యగలరేమో అడిగి చూడండి!"

గంభీరంగా పలికింది నరసింహారెడ్డి కంఠం "ఎవరు చెయ్యగలరీ పని?"

జనంలో కొద్ది కాలంపాటు గుసగుసలు. పిదప అందరూ తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

ఆమె సంబంధీకులు దుఃఖాన్ని ఉధృతం చేశారు.

నరసింహారెడ్డికి ఎటూ తోచని పరిస్థితి ఏర్పడింది. చివరికో నిర్ధారణ కొచ్చి ఉప్పొంగే ఆవేదనతో, ఆవేశంతో పలికాడు.

"ఈ పని చేసిన వారికి ఏది కోరినా ఇస్తాను. ఎవరు చెయ్యగలరీ పని? చెప్పండి?"

"..............."

నిశ్శబ్దం కాసేపు రాజ్యమేలింది.

జనం ఒకరి ముఖాల నొకరు చూసుకొన్నారు.

"ఎవ్వరూ చెయ్యలేరా? ఆమె ప్రాణాలు పోవల్సిందేనా?" అతని కంచుకంఠం ఆవేదనతో వణికిపోయింది.

ఓ నిముషకాలం తిరిగి నిశ్శబ్దం ఆ తర్వాత...

"నే చెయ్యగలను" అంటూ జనాన్ని మధ్యగా వేరుచేస్తూ ముందుకు వచ్చాడు ఓ పొడుగాటి వ్యక్తి! అతను నిలువెత్తు నల్లటి వస్త్రాలు ధరించి వున్నాడు. చూడడానికి బలహీనంగా వుండి, అతని వొంట్లో కండపుష్టి లేకపోయినా... అతని ముఖంలో మాత్రం ఏదో తెలియని తేజస్సు జనాన్ని ఆకర్షితుల్ని చేస్తూ వుంది. అతని వర్చస్సుకు అందరూ మంత్రముగ్ధులయ్యారు. అతను తన పొడుగాటి గడ్డాన్ని ఓమారు తడుముకొని ఎడమ చేతిలోని మూడడుగుల వొంకర కర్రను కుడిచేతిలోకి మార్చుకున్నాడు. ఆ కర్ర సర్పం ఆకారం పోలివుంది.

నరసింహారెడ్డి వంక సూటిగా చూస్తూ పలికాడు.

"దొరా! నేను చెయ్యగలనీ పని"

సమాధానంగా "ఎవరు స్వామీ మీరు?" అడిగాడు నరసింహారెడ్డి.

అందుకు సమాధానంగా అతను ఇలా చెప్పాడు –

"దొరా! నేనీపని చెయ్యగలను. ప్రతిఫలంగా మరి నాకేమిస్తావు?"

"మీరడిగింది ఏదైనా ఇస్తాను స్వామి. చివరికి నా ప్రాణాలు కోరినా ఆనందంగా ఇస్తాను."

"ప్రాణాలవసరం లేదు. నే కోరింది తప్పకుండా తీర్చాలి."

"అలాగే స్వామీ" వినమ్రుడై చెప్పాడు నరసింహారెడ్డి.

"మాట తప్పవుగా!" నరసింహారెడ్డిని పరీక్షగా చూస్తూ అడిగాడు అతను.

"మాట తప్పడమా స్వామీ! అది మా మజ్జారి వంశంలోనే లేదు. ఇచ్చిన మాట తప్పే వంశం కాదు మాది ఇచ్చిన మాట తీర్చడం కోసం ప్రాణాలకు సైతం వెరవని వంశం మాది."

నరసింహారెడ్డి పలుకులో పౌరుషం ప్రజ్వరిల్లింది.

"స్వామీ! ఈ నా నొస్సం ప్రజలపై ప్రమాణం చేసి చెబుతున్నాను. మీ కోరిక ఎలాంటిదైనా, ఎంతటిదైనా నే తీర్చడానికి సిద్ధంగా వున్నాను." రెడ్డి పలుకుల్లో దృఢనిశ్చలత!

అతని ముఖంలో సంతృప్తి!

తాను దేనికై వచ్చాడో అది రెడ్డి తప్పక తీర్చగలడని నమ్మకం కలిగింది అతనికి. మెల్లిగా ఒక్కో అడుగు వేస్తూ స్పృహ తప్పుతోన్న ఆమెను సమీపించి, ఆమె ఆపాదమస్తకం పరీక్షించి, ఆమె గర్భానికైన గాయాన్ని తేరిపార జూస్తూ క్రిందికి వొంగి మోకాలిపై కూర్చొని పక్కనే కొద్ది దూరంలో నిల్చున్న ఓబయ్యను పిల్చాడు. ఓబయ్య జాగుచెయ్యక 'ఆజ్ఞ స్వామీ' అంటూ అతని చెంత చేరాడు.

"ఓబయ్యా!"

ఓబయ్యలో విస్మయం!

తన పేరు ఇతనికెలా తెలిసిందని.

అతను చిద్విలాసంగా నవ్వుతూ "నీ పేరేకాదు ఓబయ్య నీ గురించి, నీ స్వామి భక్తి గురించి కూడా తెలుసు" అంటూ చిన్నగా ఓబయ్య భుజం తట్టి "అమ్మవారి విగ్రహం ముందున్న ప్రమిద ఇలా తీసుకురా!" అంటూ పురమాయించాడు.

"అలాగే స్వామి" అంటూ క్షణకాల వ్యవధిలోనే అమ్మవారి విగ్రహం ముందున్న ప్రమిదను తెచ్చి అతనికి అందించాడు ఓబయ్య.

అతను అంతవరకు తన భుజానికి తగిలించుకున్న జోలెలాంటి తెల్లటి సంచి నుంచి పొడుగాటి సన్నటి పుల్లను బయటికి తీసి ప్రమిద వెలుగులో దాన్ని అంటించి... వెలుగును మాత్రం ఆర్పి దాని వేడిమిని మాత్రం శిశువు చేతికి చేరువుగా తీసుకెళ్ళి సెగ చూపాడు.

అంతే!

ఆ సెగలోని వేడిమిని భరించలేని ఆ శిశువు చప్పున తన చిరు హస్తాన్ని గర్భం లోపలికి తీసుకుంది.

ఇక్కడ అతను చూపించింది మహిమ కాదు, సమయస్ఫూర్తి మాత్రమే?

అతని సమయస్ఫూర్తికి, అక్కడి జనులందరూ జోహారులర్పించారు. అభినందనల శరపరంపర మొదలైంది.

నరసింహారెడ్డి కంట ఆనందభాష్పాలు వొలికాయి.

"స్వామీ!" అంటూ అతనికి ప్రణామం చేశాడు.

అతను నరసింహారెడ్డిని తన అక్కున చేర్చుకొన్నాడు. అప్పటికే అతనెవరో గుర్తుతెచ్చుకున్న కొద్దిమంది జనం జయజయ ధ్వనులు చెయ్యడం ప్రారంభించారు.

"స్వామి గోసాయి వెంకన్నకు జై!

దొర నరసింహారెడ్డికి జై!" అంటూ...

## 3

గోసాయి వెంకన్నను తన కోటకు తీసుకెళ్ళాడు నరసింహారెడ్డి. ఆ రాత్రి వారి మధ్య సంభాషణ ఇలా మొదలైంది.

"నరసింహారెడ్డి నీ గురించి అంతా విన్నాను"

"ఏమని విన్నారు స్వామి?" చిరునవ్వుతో అడిగాడు నరసింహారెడ్డి.

"చిన్నప్పటి నుంచి నీకు బ్రిటిష్ వారంటే ద్వేషమని"

"అవును స్వామి. నాకే కాదు ఆత్మాభిమానం వున్న వారెవరైనా బ్రిటిష్ వారిని ద్వేషిస్తారు. ఎక్కడినుంచో వచ్చి ఈ గడ్డపై తన అధికారం చెలాయించటమేమిటి? మనల్ని బానిసలకన్న హీనంగా చూడ్డమేమిటి? శిస్తుకోసం ప్రజలను ఎంతగా బాధిస్తున్నారో మీకు తెలియంది కాదు" అన్నాడు నరసింహారెడ్డి.

"ప్రజల వద్దనుంచి శిస్తు వసూలు చేయటంలో భరణం అందుకొంటున్న మిగతా పాలెగాళ్ళలా నీవు వారితో సహకరించటం లేదని, నీ భరణాన్ని నామమాత్రపు భరణంగా పదకొండు రూపాయలకు కుదించింది" చెప్పాడు గోసాయి వెంకన్న.

"కేవలం పదకొండు రూపాయల భరణంతో నేనూ నా పరివారం మనుగడ సాగించటం కష్టం అన్న విషయం మీకు తెలియంది కాదు. కేవలం ప్రజల ఆదరాభిమానాలతో జీవనం సాగిస్తున్నాను. నా మజ్జారి వంశ గౌరవాన్ని అలాగే నిలుపు కొంటూ వస్తున్నాను."

"నీ వ్యక్తిత్వం ఎలాంటిదో వినే నీ వద్దకు బయల్దేరి వచ్చింది. అయితే అనుకోకుండా జాతరలో జరిగిన దుర్ఘటన సందర్భంలో మనం కలుసుకోవలసి వచ్చింది. ఏది ఏమైతేనేం? మనం కలుసుకొన్నాం. నాకు ఆనందంగా వుంది" అన్నాడు గోసాయి వెంకన్న.

"నాకూ ఆనందంగా వుంది స్వామి. మీరేదో కోరిక కోరుతానన్నారు. కోరండి? అదెలాంటి కష్టసాధ్యమైనదైనా నెరవేర్చే ప్రయత్నం చేస్తాను" అన్నాడు నరసింహారెడ్డి.

"కష్టసాధ్యమే!" చిన్నగా నవ్వుతూ అన్నాడు గోసాయి వెంకన్న.

"చెప్పండి స్వామి?"

"చెప్పాక కాదంటావేమో?"

"మాట తప్పటం మా మజ్జారి వంశంలోనే లేదు. చెప్పండి!" ఉద్రేకంగా పలికాడు నరసింహారెడ్డి.

తన మనసులోని ఉద్దేశం చెప్పాడు గోసాయి వెంకన్న. "అదే నీవు తీర్చవలసిన కోరిక" అని చెప్పాడు.

ఆలోచనలో పడ్డాడు నరసింహారెడ్డి. అతని సందిగ్ధావస్థను గమనించి గోసాయి వెంకన్న మనసులోనే చిన్నగా నవ్వుకొన్నాడు. అతను కోరుకొన్నది కూడా అదే!

"నేను విశ్రాంతి తీసుకొంటాను. బాగా పొద్దుపోయింది."

"అలాగే స్వామి.." అంటూ తన అనుచరుడు ఓబన్నను పిలిచి గోసాయి వెంకన్న విశ్రాంతికి తగిన ఏర్పాటు చేయించాడు. నరసింహారెడ్డికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. మస్తిష్కంలో ఎడతెరిపి లేని ఆలోచనలు. తన గదిలో అటు ఇటు తచ్చాడుతూనే ఆ రాత్రి వెళ్ళదీశాడు.

గోసాయి వెంకన్న కోయిలకుంట్లకు దగ్గర్లోనున్న ఆకుమళ్ళ గ్రామనివాసి. చిన్నప్పటి నుంచి అతనిలో ఏవో తెలియని ఆలోచనలు. అతన్ని సంసారిని చేయలేక పోయాయి. మనసులో అశాంతి వూరు వొదిలాడు. అనేక ప్రదేశాలు తిరిగాడు. సాధువులను కలిశాడు. వారి అనుభవాలు తెలుసుకొన్నాడు. మూలికా వైద్యం, కనికట్టు విద్యలు నేర్చాడు. చివరికి గోసాయి వెంకన్నగా మారాడు. ప్రజల్లో గౌరవ అభిమానాలు పొందాడు. అయితే స్థిరనివాసం అన్నది లేక చాలాకాలం సంచార జీవితం గడిపాడు. బ్రిటిష్‌వారు జరిపిన కొన్ని అమానుష ఘటనలను కళ్ళారా చూసిన అతను చలించిపోయాడు. జాతర మూలంగా చివరికి నరసింహారెడ్డి కోటకు చేరుకొన్నాడు.

రెండ్రోజులు గడిచాయి. నరసింహారెడ్డి సందిగ్ధావస్థలో వున్న ఆ పరిస్థితిలో అనుకోకుండా ఓ సంఘటన జరిగింది. నెలనెల తనకు రావలసిన తవర్జీ కోసం తన అనుచర వర్గంలో ఒకరైన ఖాసీంసాహెబ్‌ను పంపేవాడు నరసింహారెడ్డి. ఈ మారు కూడా తవర్జీ తేవడానికి ఖాసీంసాహెబ్‌ను పంపాడు నరసింహారెడ్డి. అతను రిక్తహస్తుడై వచ్చి నరసింహారెడ్డితో చెప్పాడు.

"దొరా!"

"ఏమైంది ఖాసీం? ఎందుకలా వున్నావు? తవర్జీ తెచ్చావా?" కళావిహీనంగా వున్న అతని ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు నరసింహారెడ్డి.

"లేదు దొరా!" నిస్తేజంగా బదులిచ్చాడు ఖాసీంసాహెబ్.

"ఎందుకని?"

"దొరా! ఎప్పటిలా తవర్జీ తేవడానికి కోవెలకుంట్లకు వెళ్ళాను. ఇప్పుడెవరో కొత్త తాసీల్దార్ వచ్చాడు. చాలా పొగరుబోతు. పేరు రాఘవాచారి మిమ్మల్ని అనరాని మాటలు అన్నాడు."

"ఏమన్నాడు?" నరసింహారెడ్డిలో ఆవేశం.

ఖాసింసాహెబ్ మెల్లిగా జరిగింది చెప్పాడు.

"ఒకవైపు బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చే తవర్జీ తీసుకొంటూ, మరొక వంక, శిస్తు వసూలు చేసేందుకు ఆంగ్లేయులకు తవర్జీ అందుకొంటున్న మిగతా పాలెగాళ్ళలా సహకరించక, శిస్తు కట్టొద్దని ప్రచారం చేస్తాడా? అయినా బ్రిటిష్ వారు వేసే ముష్టి తీసుకొంటున్న ఆ ముష్టి వాడికి, మరొక ముష్టివాడా! ఆ ముష్టిగాడ్నే రమ్మన్నా అని చెప్పు అన్నాడు దొర"

ఖాసీంసాహెబ్ చెప్పింది విన్న నరసింహారెడ్డి ఉగ్రనరసింహుడయ్యాడు.

"రేయ్ రాఘవాచారి! నీకు రోజులు దగ్గరపడ్డాయి. నా చేతిలో నీకు చావు తప్పదు." అని నిలువెల్లా ఆవేశంతో వూగిపోతూ ఓ అనుచరుణ్ణి పిలిచి ఇలా కమ్మ రాయించాడు.

"రేయ్ ! రాఘవాచారి ! కండకావరంతో నన్నే అవమాన పరుస్తావా? రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఈ నరసింహారెడ్డి నీ తల తీయడానికి, నీ ట్రెజరీని కొల్లగొట్టడానికి వస్తున్నాడు. చేతనైతే నీ ప్రాణాలు, ట్రెజరీని రక్షించుకో!

ఇట్లు

నీ కాలయముడు

**దొర నరసింహారెడ్డి**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Palegadu**

* * *